# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- విజ్ఞానం, అంతరిక్ష రంగాలపై పిల్లల మనసుల్లో ఆశక్తి పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమంలో పేర్కొన్నారు.
- ప్రపంచ వ్యాప్తంగా సులభమైన, స్వేచ్ఛాయుత మార్కెట్లను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి పియూష్ గోయల్ స్పష్టం చేశారు.
- ఆపరేషన్ సింధూర్ అంశంపై రేపు లోక్‌సభలో చర్చ ప్రారంభం కానుంది.
- మాంచెస్టర్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్ట్ మ్యాచ్ లో భారత్ స్వల్ప ఆధిక్యతతో కొనసాగుతోంది.

==========================

అంతరిక్ష యాత్ర పూర్తి చేసుకుని భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా క్షేమంగా భూమి మీదికి చేరుకోవడంతో దేశ ప్రజల సంతోషానికి అవధులు లేవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "మన్ కీ బాత్ మనసులోని మాట" 124వ సంచికలో భాగంగా ఈ రోజు ప్రధానమంత్రి దేశ ప్రజలను ఉద్దేశించి ఆకాశవాణి ద్వారా తన భావాలను పంచుకున్నారు. విజ్ఞానం, అంతరిక్ష రంగాలపై పిల్లల మనసుల్లో ఆశక్తి పెరిగిందని అన్నారు. నేడు పాఠశాల విద్యార్థులు కూడా అంతరిక్షంలోకి వెళ్తామని, చంద్రుడిని చేరుకుంటామని, అంతరిక్ష శాస్త్రవేత్తలుగా ఎదుగుతామని చెప్పడం మంచి పరిణామమన్నారు. క్రీడలు, విజ్ఞానం, సంస్కృతి పరంగా దేశ ప్రజలు గర్వపడేలాంటి ఎన్నో విషయాలు ఇటీవల జరిగాయని ప్రధానమంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

దేశంలో స్పేస్ స్టార్టప్స్ కూడా వేగంగా పెరుగుతున్నాయని, ఐదేళ్ళ క్రితం యాభై కన్నా తక్కువ స్టార్టప్స్ ఉండేవని, నేడు 200 కంటే ఎక్కువ ఉన్నాయని అన్నారు. భారతీయ విద్యార్థులు ఇటీవల ఇంటర్నేషనల్ కెమిస్ట్రీ ఒలంపియాడ్ లో పతకాలు సాధించారని చెప్పారు. గణిత ప్రపంచంలో కూడా భారత్ తన సత్తాను చాటుతూ... ఆస్ట్రేలియాలో జరిగిన అంతర్జాతీయ మేథమేటికల్ ఒలింపియాడ్ లో భారతీయ విద్యార్థులు మూడు స్వర్ణ, రెండు రజత, ఒక కాంస్య పతకాలను సాధించారని వెల్లడించారు. అలాగే దేశంలోని 12 కోటలను ప్రపంచ చారిత్రక

స్థలాలుగా యునెస్కో గుర్తించిందన్నారు. ప్రతి కోటలోనూ ఎంతో చరిత్ర దాగి ఉందని, ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్షిగా ఇవి నిలుస్తున్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-బ్రిటన్ దేశాల మధ్య జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదని... ఇది అభివృద్ధి చెందిన భారతదేశం దిశగా వేసిన ధైర్యవంతమైన ముందడుగని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఈ రోజు ముంబైలో "బ్రిటన్ మార్కెట్‌లో ఎగుమతి అవకాశాలు" అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పియూష్ గోయల్ మాట్లాడుతూ... భారతదేశ అంతర్జాతీయ వాణిజ్య ప్రస్థానంలో చారిత్రాత్మక ఘట్టమైన ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) ఫలితంగా భారతీయ వ్యాపారవేత్తలు, ఎగుమతిదారులకు నూతన అవకాశాలు లభిస్తాయన్నారు. మత్స్య పరిశ్రమ, వస్త్ర, ఆభరణాలు, ఐటీ, సేవల రంగం, ఎంఎస్ఎంఈలు వంటి రంగాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో నూతన పోటీ, అవకాశాలను అందిస్తుందని తెలిపారు. భారతీయ తయారీదారులకు ప్రపంచ వ్యాప్తంగా సులభమైన, స్వేచ్ఛాయుత మార్కెట్లను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పియూష్ గోయల్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ అంశంపై రేపు లోక్‌సభలో చర్చ ప్రారంభం కానుంది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారతదేశ ప్రతిస్పందనపై ప్రత్యేక చర్చ కొనసాగుతుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీనిపై లోక్‌సభలో చర్చకు 16 గంటల సమయం కేటాయించగా, మంగళవారం నుండి రాజ్యసభలో 16 గంటల పాటు దీనిపై చర్చిస్తారని ఆయన తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ గుర్తింపు, ప్రతిష్టలకు రాజరాజ చోళుడు, రాజేంద్ర చోళుడు పేర్లు పర్యాయపదాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ఈరోజు అరియలూర్ జిల్లాలో చోళ చక్రవర్తి ఒకటవ రాజేంద్ర చోళుడు జయంతిని పురస్కరించుకొని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆది తిరువతిరై ఉత్సవం ముగింపు వేడుకలో ప్రధానమంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా నీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ ప్రధానాంశాలుగా చర్చలు జరుగుతున్నాయని అన్నారు. వీటి ప్రాముఖ్యతను భారతదేశ పూర్వీకులు అర్థం చేసుకున్నారని చెప్పారు. అనేక మంది రాజులు ఇతర ప్రాంతాల నుండి బంగారం, వెండి వంటివి తీసుకువచ్చి గుర్తింపు పొందారని, రాజేంద్ర చోళుడు పవిత్ర గంగా జలాన్ని తీసుకురావడం ద్వారా గుర్తింపు పొందారన్నారు. తమిళనాడులో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు గంగైకొండ చోళపురం ఆలయంలో నరేంద్రమోదీ పూజలు చేశారు. 140 కోట్ల మంది భారతీయుల సంక్షేమం, దేశ నిరంతర పురోగతి కోసం తాను ప్రార్థించానని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి, కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లతో కలిసి రాజేంద్ర చోళుడు గౌరవార్థం స్మారక నాణాన్ని ప్రధానమంత్రి విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లాజిస్టిక్స్‌ను కేవలం వస్తువులను పంపిణీ చేసే ప్రక్రియగా కాకుండా, వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన అంశంగా చూడాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. ఈరోజు వడోదరలోని గతి శక్తి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమంలో దృశ్యమాధ్యమంలో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... ఆపరేషన్ సింధూర్ విజయానికి సమర్ధవంతమైన లాజిస్టిక్స్ నిర్వహణే నిర్ణయాత్మక అంశంగా నిలిచిందని తెలిపారు. దేశ ఆర్థిక ప్రగతిలో లాజిస్టిక్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ.. భారతదేశ GDPలో లాజిస్టిక్స్ రంగం ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఎంతో ముఖ్యమని అన్నారు. గత 11 సంవత్సరాల్లో భారత్ అపూర్వమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిని సాధించిదని, దీని ఫలితంగా ఆర్థిక ఉత్పాదకత పెరగడం, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం, సేవలను మెరుగుపరచడం సాధ్యపడిందని చెప్పారు.

(వాయిస్ 36 సెకన్లు)

============================

మాంచెస్టర్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు క్రికెట్ మ్యాచ్ లో భారత్ రెండవ ఇన్నింగ్స్‌లో టీ విరామ సమయానికి 4 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. దీంతో భారత్ 11 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

============================

తూర్పు రాజస్థాన్‌లో కొన్ని చోట్ల రేపు అతిభారీ వర్షాలు కురుస్తాయని, అలాగే ఈశాన్య భారతదేశంలో భారీ నుండి అతి భారీ వర్షపాతం కొనసాగే అవకాశం ఉందని  భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఆగస్టు 1 నుండి 3 తేదీల మధ్యలో ఈ ప్రాంతంలో భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. ఈ నెల 29 నుండి 31 తేదీల మధ్యలో పశ్చిమ హిమాలయ ప్రాంతంలో భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

============================
============================